క్లుప్తంగా...

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీకి చెందిన ఉత్తమ్‌కుమార్‌కు రూ.1.50 లక్షలు, సురేందర్ రాజుకు రూ.లక్షకు సంబంధించిన చెక్కులను మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు మమతకృష్ణారెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, నాగారం మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ప్రధాన రహదారిలో ఉన్న సెంట్రల్ లైటింగ్ వీధి దీపాలు పనిచేయకపోవడంతో సుమారు రూ.4.5 లక్షల మున్సిపల్ నిధులను వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నట్లు స్థానిక కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అహ్మద్‌గూడ ప్రధాన రహదారిలోని సెంట్రల్ లైటింగ్ వీధి దీపాల మరమ్మతులను ఆమె పరిశీలించారు.

పాఠశాలకు కంప్యూటర్ విరాళం



మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారంలోని ప్రాథమిక పాఠశాలకు స్టేట్ కాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ప్రొజెక్టర్ విరాళంగా అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధి బాలగిరి హిమజ శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులకు కంప్యూటర్ అందజేశారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండటం భవిష్యత్‌లో ఉన్నత చదువులకు ఉపయోగకరంగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఆధునిక పరిజ్ఞానం



కేపీఆర్ఐటీ వర్క్‌షాప్‌లో ప్రిన్సిపల్ ఈశ్వర్, అధ్యాపకులు

ఘట్‌కేసర్: ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(కేపీఆర్ఐటీ) ప్రిన్సిపల్ ఈశ్వర్ అన్నారు. ఘనాపూర్‌లోని కేపీఆర్ఐటీలో టెక్సకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం డెవోప్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా కంప్యూటర్స్ సైన్స్ విభాగాధిపతి సుజాత, టెక్స్ అకాడమీ మేనేజర్ మోహన్‌దాస్, శిక్షకుడు తాహెర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనాథ్ కశ్యప్, కోఆర్డినేటర్ వీణా, శ్రీకాంత్, విజయ్, భువనేశ్, విశాల్‌రాజ్, వేణు పాల్గొన్నారు.

పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: పేదల ఇబ్బందుల పట్ల అవగాహన కలిగి ఉన్న సీఎం కేసీఆర్ పలు పథకాలతో వారికి పెన్నిధిగా నిలిచారని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గుండ్లపోచంపల్లిలో పెన్షన్‌దారులు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలకు ఆసరాగా నిలిచిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు అమరం జైపాల్‌రెడ్డి, మల్లికార్జున్, బాలరాజ్, హేమంత్‌రెడ్డి, ఏఈ దుర్గాప్రసాద్, అధికారులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపలతో విందు.. భలే పసందు

- చికెన్, మటన్ బోరుగా ఫీలై ఫిష్ ఫుడ్‌పై దృష్టి
- ఎన్టీఆర్ స్టేడియం, శామీర్‌పేట్‌లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్
- మేడ్చల్ కలెక్టరేట్‌లోనూ ఫిష్ స్టాల్ ఏర్పాటు
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మత్స్యశాఖ



సాక్షి, మేడ్చల్ జిల్లా: మాంసాహార ప్రియులు చికెన్, మటన్‌తో పాటు చేపలపై దృష్టి సారించారు. చేపలతో పులుసు, కూర, వేపుడు, ప్రాన్స్ బిర్యాని, చేప పకోడి, ఫిష్ కట్లెట్, ఫింగర్, అపోలో ఫిష్ వేపుడు, పచ్చడి సహా పలు రకాల వంటకాలు చేసుకోవడానికి అవకాశముంది. చేపల వంటకాల లిస్టు చదువుతుంటేనే నోరు ఉరుతుంది కదూ.. ఒక్కసారి రుచి చూస్తే మళ్లీ తినాలనిపిస్తుంది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరంతో సహా శివారు జిల్లాలోని బస్తీలు, ప్రాంతాలు, గ్రామాల్లో చెరువుల పండగ ఘనంగా జరుపుకున్నారు. అలాగే, గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని పలు కేంద్రాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ గురువారం మొదలు కాగా, శుక్రవారం కొనసాగింది. శనివారం కూడా కొనసాగుతుంది. ప్రజల నుంచి ఆదరణ లభిస్తే.. పొడగించే అవకాశం ఉంటుందని మత్స్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రజలకు చేపలతో చేసిన వివిధ వంటకాలను మత్స్యకారుల కుటుంబాలు పరిచయం చేస్తున్నాయి.

- నగర శివారు జిల్లాల్లోని చెరువుల్లో ప్రతి సంవత్సరం లక్షలాది చేప పిల్లలను ఉచితంగా వదులుతున్నారు. గతేడాది మేడ్చల్ జిల్లాలో దాదాపు 250 చెరువుల్లో 91 లక్షల చేప పిల్లలను వదలగా, రంగారెడ్డి జిల్లాలో కోటికి పైగా చేప పిల్లలను చెరువుల్లో వదిలారు. ఈ చేప పిల్లలు పెద్దయ్యాక మత్స్యకారులు పట్టుకుని విక్రయించుకుని లబ్ధి పొందుతున్నారు. చెరువుల్లో చేప పిల్లలను వదిలి మత్స్యకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోంది. మార్కెటింగ్ చేసేందుకు వాహనాలను కూడా అందిస్తోంది. అలాగే, రాయితీ పథకాలను కూడా అమలు చేస్తోంది. చెరువులు, జలాశయాల్లో చేపలను వివిధ ప్రాంతాలకు మత్స్యకారులు తరలించి విక్రయించడం ద్వారా ఆర్థికంగా కొద్దోగొప్పో లబ్ధిపొందుతున్నారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

- మార్కెట్‌లో మాంసం ధరలు పెరగడంతో ఆరోగ్యానికి మేలు చేసే చేపల ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని భావిస్తున్నారు. మత్స్యకారులకు లబ్ధి చేకూరే విధంగా ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తే స్థానిక ప్రజలకు చేపల వంటకాలపై ఆసక్తి పెరుగుతుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మత్స్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. చేప వంటకాలలో అనుభవం కలిగిన మహిళలు, పురుషులతో నగరంలోని ఎన్టీఆర్ పార్కులో ఫుడ్ ఫెస్టివల్‌ను మూడు రోజుల పాటు చేయగా, ఇందులో 40 స్టాల్స్(దుకాణాలు) ఏర్పాటు చేశారు. అలాగే, శామీర్‌పేట, మేడ్చల్ కలెక్టరేట్ మైదానంలో కూడా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

ఫిష్ ఆరోగ్యానికి మేలు

చేపలు మంచి పోషకాహారం. వీటిని ఏ రూపంలో తీసుకున్నా.. ఆరోగ్యానికి ఎంతో మేలు. చేపలతో అనేక రకాల వంటకాలు చేసే అవకాశం ఉంటుంది. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌తో మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తోంది.

- బి.పూర్ణిమ, మత్స్యశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

నైపుణ్యం వెలికి తీసేందుకే క్రీడాపోటీలు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి

ఘట్‌కేసర్: కాచివానిసింగారం బాబురావు క్రికెట్ మైదానంలో 'మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్'ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి హాజరై టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని, ఇందులో మండలంలోని 11 గ్రామాల నుంచి 32 జట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు భిక్షపతిగౌడ్, స్థానిక సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

కీసర: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ పేరుతో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కీసర మండలం చీర్యాల కమాన్ సమీపంలోని ఎస్ఆర్‌కే క్రికెట్ స్టేడియంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. బిబ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, గూడురు అశోక్‌గౌడ్, శ్రీనివాస్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడలో కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక కౌన్సిలర్ రజితవెంకటేశ్, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తోటకూర వజ్రేశ్‌యాదవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ రజిత వెంకటేశ్ వారిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్టీసీని ఆదరించాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

ఘట్‌కేసర్: ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని కమిషనర్ వేమనరెడ్డి, ఎస్సై అశోక్ అన్నారు. పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణం ఆవరణలో శుక్రవారం విలేజ్ బస్సు అధికారుల కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్య ప్రజల కోసం నడిపిస్తున్న ఆర్టీసీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చెంగిచెర్ల డిపో మేనేజర్ ఈసు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఆనందరావు, మెకినికల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, బస్ స్టేషన్ మేనేజర్ వెంకటేశ్, స్థానికులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

కీసర: గుర్తు తెలియని మహిళ(45-50) మృతదేహాన్ని కీసర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే గురువారం చీర్యాల గ్రామానికి చెందిన వీఆర్ఏ కోల నరేష్ గ్రామంలోని సర్వే నెంబర్-62 పరిధిలోని రేగు కృష్ణకు వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉందని కీసర పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు ఘటనా స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెల్లి కృష్ణకు పరామర్శ

పోచారం: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు బెల్లి కృష్ణ యాదవ్‌ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. అన్నోజిగూడలోని సాయినగర్ కాలనీలోని కృష్ణ ఇంటికెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ అధికారంలోకి వస్తే భువనగిరి జిల్లా పేరును బెల్లి లలిత జిల్లాగా మారుస్తామని చెప్పారు. ఉద్యమకారులను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుపరిపాలన దినోత్సవం

కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిపాలన సంస్కరణల ఫలితాలను ప్రజలకు తెలియజెప్పేందుకు శనివారం కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి, ఇతర ప్రజానిధులు పాల్గొంటున్నారన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు, పరిపాలన సంస్కరణలను ప్రజలకు మరింత చేరువచేయడమే లక్ష్యంగా సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణాలు, గ్రామాల్లో పరిపాలన సౌలభ్యంపై ఇంకా ఏమైనా మార్పులు అవసరమనే విషయాలను ప్రజల నుంచి తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు గాయత్రీదేవి గుడిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పోచారం: అన్నోజిగూడలోని శ్రీగాయత్రీదేవి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రాతఃకాల పూజతో ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందులో భాగంగా మాధవానందసరస్వతీ స్వామిచే యంత్ర ప్రతిష్ఠ ఉంటుందన్నారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

ప్రేమ వివాహాలకు బలమైన బంధం

మహనీయుల ఉత్సవ కమిటీ



వధూవరులను ఆశీర్వదిస్తున్న బల్లి రోజాశ్రీనివాస్, సురేందర్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 3వ డివిజన్ నాచారం ఫైర్ విక్టిమ్ కాలనీకి చెందిన ప్రేమికులకు జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దేవాలయంలో వివాహం జరిపారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బల్లి రోజాశ్రీనివాస్ నూతన వధూవరులకు నూతన వస్త్రాలు, పుస్తె మట్టెలు అందచేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్ మాట్లాడుతూ.. ప్రేమ వివాహాలకు బలమైన బంధం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్, ప్రధాన కార్యదర్శి పరుశురాం, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, పద్మారావు ముదిరాజ్, నాగేష్, నరేందర్, పరమేష్‌చారి, రాముచారి, సావిత్రి, సాయి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొఫెసర్ శ్వేత

మేడ్చల్: విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయూ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని హితం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆమె పాల్గొని పట్టాలు అందజేశారు. విద్యార్థులకు చదువులు పూర్తయ్యాక ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని నిలదొక్కుకుంటేనే వారు జీవితంలో రాణించగలుగుతారని అన్నారు. కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు అమెరికాకు చెందిన ఎన్ఏఈ నిర్వహించే గ్రాండ్ చాలెంజింగ్ స్కాలర్స్ ప్రోగ్రాంను పూర్తి చేయడంతో వారిని అభినందించారు.

ఆకట్టుకున్న ఎక్స్‌పో..

కళాశాలలో నిర్వహించిన ఎక్స్‌పో ఆకట్టుకుంది. చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో మిలటరీ కళాశాల ప్రొఫెసర్ లెఫ్టినెంట్ కల్నల్ హర్మీత్‌సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ ముండగోయంకర్, గీత యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మోతహర్ రెజా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉన్నారు

మంత్రి చామకూర మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్రం ఏర్పడిన తర్వాతే ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సంక్షేమ సంబురాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక్కడ అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేయడం మన రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. నీరు, విద్యుత్తు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ఇంగ్లిష్ బోధన, పల్లెప్రగతి, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, రైతుబీమా, దళితబంధు వంటి ఎన్నో కార్యక్రమాలను సీఎం కేసీఆర్ చేపట్టారన్నారు. బీసీ కుల, చేతి వృత్తుల దారుల కుటుంబంలో ఒకరికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, మేయర్లు జక్కా వెంకట్ రెడ్డి, మేకల కావ్య, మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో- ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మంత్రి మల్లారెడ్డి 500 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలతోపాటు రెండో విడత గొర్రెల పంపిణీ పథకం కింద ప్రొసీడింగ్ లెటర్లు, బీసీ కులవృత్తుదారులకు రూ.లక్ష ఆర్థిక సాయానికి సంబంధించిన ప్రొసీడింగ్ లెటర్లను అందజేశారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న గ్రూప్ -1 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ ఆంజనేయులు(ఎగ్జామ్స్), కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ముతో దశాబ్ది ఉత్సవాలు

ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ పేరుతో సంక్షేమ సంబరాలు నిర్వహించడం దురదృష్టకరమని, పెళ్లయ్యి రెండు సంవత్సరాలు దాటినా ఘట్‌కేసర్ మండలంలోని పలువురి ఎస్టీలకు ఇప్పటి వరకు కల్యాణ లక్ష్మీ రాలేదని ఘట్‌కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని మూడేళ్లు గడుస్తున్నా ఇంకా రాలేదని, దీనిపై అధికారులను అడిగితే పింఛన్ తీసుకున్న వారు చనిపోయిన తర్వాత వారి స్థానంలో కొత్త పింఛన్ ఇస్తామంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటి వరకు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. జిల్లాలో లక్ష రేషన్ కార్డుల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్‌ల పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పేదలకు అందడం లేదన్నారు. బీసీ ఆర్థిక సాయం రూ.200 కోట్లు కేటాయించగా, మేడ్చల్ నియోజకవర్గానికి రూ.2 కోట్లు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. ఇది ఎన్నికల ప్రచారానికి తప్ప ఎందుకూ పనికి రాదన్నారు. ప్రజల సొమ్ముతో బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం సహించరానిదన్నారు.

కీసర పీఏసీఎస్‌లో స్ట్రాంగ్‌రూమ్ ప్రారంభం



స్ట్రాంగ్‌రూమ్ ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి

కీసర: కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను శుక్రవారం సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు గోల్డ్ లోన్లు ఇచ్చామన్నారు. రైతుల బంగారం భద్రపరిచేందుకు ఈ స్ట్రాంగ్‌రూమ్ ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా రైతులకు లాకర్లను కూడా అందుబాటులో ఉంచుతామని, లాకర్లు కావాల్సిన రైతులు కీసర సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, సొసైటీ సభ్యులు మాదిరెడ్డి భూపాల్‌రెడ్డి, కాంసాని మల్లారెడ్డి, కౌకుట్ల అంజిరెడ్డి, నాయక్, మల్లేష్‌యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ గుర్రం లక్ష్మారెడ్డి, సొసైటీ సీఈఓ కృష్ణారెడ్డి, సిబ్బంది నరహరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈసీలో అంతర్జాతీయ సదస్సు



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎన్ఆర్ఈసీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఐసీఈటీ ఈటీ-2023 పేరిట నిర్వహిస్తున్న సదస్సులో ఉస్మానియా, వరంగల్ నీట్ ప్రొఫెసర్లు రాజేంద్రనాయక్, రవికుమార్, సింగపూర్‌కు చెందిన నయంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీరపాండియన్ వీరస్వామి పాల్గొని ప్రసంగించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి సదస్సులతో సాంకేతిక పరిజ్ఞానం మరింత పెంపొందించుకుని మంచి నిపుణులుగా మారుతారని తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, కన్వీనర్ శోభన్, లక్ష్మిశ్రీ, పలు రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కండక్టర్లను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ డిపోలో ఒక నెలలో తక్కువ టికెట్లు విక్రయించారని, వారి ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ డిపో ఆవరణలో బీజేపీ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కార్మికులు అరుగాలం కష్టపడి సంస్థకు పని చేస్తుంటే వారు టికెట్లు విక్రయించలేదని, వారి ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి యాజమాన్యం వారిని కించపరిచి మనోభావాలను దెబ్బతీసిందని అన్నారు. మేడ్చల్ డిపోలో కార్మికులు, ప్రయాణికులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంగా వాటిని పట్టించుకోకుండా కేవలం కండక్టర్లపై కక్షపూరిత చర్యలు చేపడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిపో గేట్ వద్ద ధర్నా అనంతరం డిప్యూటీ డీఎంకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారయణ, రథన్‌రాథోడ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.